ప్రజాశక్తి

ఆదివారం 19 అక్టోబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అభివృద్ధి పనులు ప్రారంభం

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్

ప్రజాశక్తి - మేదరమెట్ల

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మేదరమెట్లలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వి వినయ్ కుమార్ ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ గుంతలు నేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా రహదారుల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాటికే పలు రహదారులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మేదరమెట్లలో డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి రూ.80 లక్షలు ఖర్చు చేసినటు తెలిపారు. అనంతంర సోమవారంపాడులో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ఎరువుల తయారీని ప్రారంభించారు. తమ్మవరంలో రూ.1.44కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జివి. సుబ్బారెడ్డి, ఎంపిడిఒ ఆర్ఎం.రాజేశ్వరి, ఎపిఒ గాయత్రి, ఎపిఎం మణికారావు, జడ్‌పిటిసి వెంకటరమణ, సర్పంచి బొనిగల ఎలిసమ్మ,వివిధ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శనగలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

▶ 4లో

ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు

▶ 8లో

మొక్కుబడిగా ధాన్యం సేకరణ లక్ష్యం

- జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి
- 15 వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం
- మిగతావి ప్రైవేటు వ్యాపారులకే..

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ధాన్యం సేకరణ లక్ష్యం మొక్కుబడిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో పండే ధాన్యాన్ని సివిల్‌సప్లయి శాఖ ద్వారా సేకరిస్తోంది. ఇందుకోసం లక్ష్యాలు నిర్దేశిస్తారు. ముందస్తు ఏర్పాట్లపై జేసీ గోపాలకృష్ణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో జిల్లాలో 15వేల టన్నులు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని ఆయన వెల్లడించారు. ఈ లక్ష్యం చాలా స్వల్పంగా ఉంది. రైతులకు మేలు చేసేలా లేదు. మార్కెట్‌లో పోటీని పెంచేలా కనిపించడం లేదని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం పాత్ర వల్ల మార్కెట్‌లో పోటీ పెరగాలి. మిల్లర్లు గానీ, వ్యాపారులు గానీ ఆందోళన చెందేలా ఉండాలి. అపుడే రైతులకు న్యాయంతోపాటు గిట్టుబాటు ధర వస్తుంది. అలా కాకుండా ప్రభుత్వం స్వల్పంగా కొనుగోళ్లు చేయడం వల్ల పోటీ తక్కువగా ఉంటుందని రైతు సంఘం నేతలు అంటున్నారు. వాస్తవానికి జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం పండుతుంది. ఇందులో 15వేలు అంటే 15శాతం ధాన్యాన్నే సివిల్ సప్లయి శాఖ సేకరిస్తోంది. దీని వల్ల రైతులకు లాభం కనిపించదు. మిగతావన్నీ ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి ఉంటుంది. జిల్లాలో సాగర్ ఆయకట్టులో సుమారు 1.90 లక్షల ఎకరాల్లో మాగాణి సాగవుతుంది. ఈఏడాది రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా ఉంది. సాగర్ ఆయకట్టులో సాగు కూడా ఆశాజనకంగానే ఉంది. మరోవైపు ఖరీఫ్‌లో కరువు వల్ల అన్ని పంటలు చేజారాయి. దీంతో రబీలో మాగాణి సాగుపై రైతులు ఎక్కువగా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో పంట దిగుబడి కూడా పెరిగే అవకాశాలున్నాయి. 2023-24లో 89,313 టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. 2024-25లో 1.07,175 టన్నుల దిగుబడి వచ్చింది. 2025-26లో 1,28,610 టన్నుల ధాన్యం పండించాలనేది విజన్ 2047 ప్రణాళికలో పేర్కొన్నారు. అంటే ఈఏడాది ధాన్యం దిగుబడి గణనీయంగా పెంచాలన్నది ప్రభుత్వం లక్ష్యం. అదే స్థాయిలో పండించిన వాటిని సేకరించే లక్ష్యంలో కనిపించడం లేదు. ప్రైవేటు వ్యాపారులు కొనాల్సిన ధాన్యమే 85శాతం ఉంది. అంటే అనివార్యంగా రైతులు మిల్లర్లపైనే పూర్తిగా ఆధారపడాల్సి ఉంటుంది. కేవలం 45 కేంద్రాలు ద్వారా 15వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. డిశంబరు నుంచి ధాన్యం మార్కెట్‌లోకి రానుంది. ముందస్తు ఏర్పాట్లపై అధికారులు సమీక్ష చేశారు. ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర అందాలంటే పోటీ పెరిగాలి. ఇపుడు భియ్యం ధరలు ఏటికేడు పెరుగుతూనే ఉన్నాయి. అలాంటప్పుడు ధాన్యం ధరలు మాత్రం ఎందుకు పెంచరనే చర్చ ఉంది. మార్కెట్‌లో పోటీ లేనందునే పొగాకు, శనగ, మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు రావడంలేదు. రేషన్‌బియ్యం కోసం ప్రభుత్వం తక్కువ రకం వంగడాలను సేకరిస్తోంది. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే ప్రభుత్వమే పెట్టుబడి ఆధారంగా ధర నిర్ణయించి మిల్లర్ల నుంచి ఇండెంట్లు తీసుకోవాలి. సివిల్ సప్లయి ద్వారా సేకరించి మిల్లర్లకు ఇస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. ఇపుడు ఇలా కాకుండా రివర్సులో జరుగుతోంది. రేషన్ బియ్యం కూడా మిల్లర్ల నుంచే సేకరిస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వం ఆధీనంలో ఉండే సంస్థలే ఈ వ్యవహారాన్ని మొత్తం చూస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

పాకల బీచ్‌ను అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

తీరంలో పర్యటిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు

పజాశక్తి-శింగరాయకొండ

పర్యాటకులను ఆకర్షించేలా, ఆహ్లాదాన్ని కలిగించేలా పాకల బీచ్‌ను అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, సంబంధిత అధికారులతో కలిసి శింగరాయకొండ మండలం పాకల వద్ద బీచ్‌ను మంత్రి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాకల బీచ్ అభివద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి జిల్లా కలెక్టర్ రాజబాబు తో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటకులను మరింత ఆకర్షించేలా,పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా పాకల బీచ్‌ను మరింత అభివద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పాకల బీచ్ గురించి పట్టించుకోలేదన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే బీచ్‌ను అభివద్ధి చేసినట్లు తెలిపారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీచ్ అభివద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పాకల బీచ్‌ను అందమైన బీచ్ గా తయారు చేసే ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ బీచ్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. బీచ్ వద్ద మంచి మొక్కలు నాటాలన్నారు. పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణాలు జరగాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా గదులను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి స్వామి, జిల్లా కలెక్టర్ రాజబాబు బీచ్ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ కళావతి, జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, డిపిఒ ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బాలశంకరరావు, సిపిడిసిఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వరరావు, పర్యాటకశాఖ అధికారి శ్రీరమ్య, ఆర్‌టిసి

▶ 2లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో..

సంక్షోభంలో వ్యవసాయ రంగం

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

ప్రజాశక్తి- ఇంకొల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో పడినట్లు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులవలేటి కృష్ణయ్య తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఇంకొల్లు, చిన్నగంజాం మండలాల రైతు సంఘం నాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణయ్య మాట్లాడుతూ దేశం, రాష్ట్రం లోనూ యూరియా సంక్షోభం రావడానికి కేంద్ర ప్రభుత్వ విధానమే కారణమన్నారు. రైతులకు ఎరువులపై సబ్సిడీ ఎగవేసే కుట్ర కోణంలో భాగమే ఈ చర్య అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా నుంచి అతి తక్కువ ధరకు పత్తి దిగుమతి చేసుకోనేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అందువల్ల మన దేశంలో పత్తి ధరలు పడిపోతాయని తెలిపారు. రాష్ట్రంలో పత్తి సాగు చేసిన రైతులకు ఆ ధర గిట్టుబాటు కాక నష్టపోయే పరిస్థితులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఏ పంట సాగు చేసిన ధరలు లేక నష్టాలతో రైతులు నష్టపోతున్నట్లు తెలిపారు. జపాన్, చైనా లాంటి దేశాలు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు ఎక్కువగా సబ్సిడీలు ఇస్తున్నాయన్నారు. కేరళ రాష్ట్రంలో సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో సహకార సంఘాలకు సంబంధించి అధిక మొత్తంలో డిపాజిట్ ఉన్నప్పటికీ వాటి ద్వారా రైతులకు ప్రయోజనాలు వనకూరే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అన్నిటినీ ప్రైవేటు పరం చేసే దిశగా ప్రయత్నిస్తుందన్నారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి

▶ 2లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో సంక్షోభంలో వ్యవసాయ రంగం

(మొదటిపేజీ తరువాయి)

రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ఇప్పటికీ రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం కేటాయించిన పొగాకు కొనుగోలు నిధిలో మిగిలిన సొమ్ము రూ.90 కోట్ల వరకు ఉన్నట్లు తెలిసిందన్నారు. అందులో కనీసం రూ.60 కోట్లు ఖర్చు చేసి మిగిలిన పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరావు మాట్లాడుతూ ఈ నెల 27న శనగ రైతులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 5న మండల రైతు మహాసభ, 15న జిల్లా రైతు మహాసభ ఇంకొల్లులో జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగేందర్ సింగయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు బాచిన కోటేశ్వరరావు, అన్నం ఆదెయ్య, సుబ్బారావు, వి హనుమంతరావు, బండ్ల శ్రీనివాసరావు, ఎర్రం గోవిందరెడ్డి, అనంతరెడ్డి, ఎం శ్రీను పాల్గొన్నారు.

పాకల బీచ్‌ను అభివృద్ధి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌ఎం సత్యనారాయణరావు, తహశీల్దారు రాజేష్, ఎంపిడిఒ డి జయమణి, ట్రాన్స్‌కో డిఇ వీరయ్య, సర్పంచి సైకం చంద్రశేఖర్, టిడిపి అధ్యక్షుడు మించాల బ్రహ్మయ్య, బత్తుల రాజగోపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతాం..

తమిళనాడు రాష్ట్రానికి చెందిన సోనా బోట్లు ఇక్కడికి వచ్చి వేట సాగించే విషయంలో వచ్చే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సోనా బోట్ల విషయంపై మత్స్య శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. తమిళనాడు ప్రభుత్వంతో మంత్రి మాట్లాడినట్లు తెలిపారు. మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులతో పాకల సముద్రం వద్ద ఏర్పాటు చేసిన బేవాచ్ టవర్ ద్వారా సముద్రంలో ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేసి సోనా బోట్లను కట్టడి చేస్తామని మంత్రి వివరించారు.

గ్రీన్ దీపావళి వేడుకల్లో 'స్ప్రింగ్ బోర్డు' విద్యార్థులు

స్ప్రింగ్ బోర్డు స్కూల్‌లో గ్రీన్ దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-గిద్దలూరు

స్ప్రింగ్ బోర్డ్ స్కూల్‌లో గ్రీన్ దీపావళి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, బాణసంచా లేకుండా పండుగ జరుపుకోవాలని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ డాక్టర్ జేవీ నారాయణ మాట్లాడుతూ దీపావళి అంటే వెలుగు, సంతోషం, మంచితనం విజయానికి ప్రతీక అని అన్నారు. మనం పటాకులు కాల్చకుండా దీపాలు వెలిగిస్తూ పర్యావరణాన్ని కాపాడటమే నిజమైన దీపావళి అన్నారు. నిజమైన ఆనందం మనం ప్రకృతిని కాపాడడంలోనే ఉంది అని తెలిపారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ పర్యావరణ స్నేహపూర్వక దీపాలు, అలంకరణలు తయారు చేశారు. పాఠశాల ప్రాంగణం మొత్తం పచ్చదనంతో, సానుకూలతతో కళకళలాడింది. పాఠశాల ప్రిన్సిపాల్ జాడి శ్వేత మాట్లాడుతూ ఈ పండుగలో ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని, పటాకులు కాకుండా ప్రకృతి రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీ గౌతమి కళాశాలలో మెగా జాబ్ మేళా

మాట్లాడుతున్న గౌతమి విద్యాసంస్థల అధినేత గుండారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

స్థానిక జవహర్ నగర్ కాలనీలోని శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల, వికాస సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో దేశంలో అత్యంత ప్రఖ్యాతిగాంచిన 16 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ గౌతమి విద్యా సంస్థల అధినేత కనుమర్ల గుండారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. ముఖ్యంగా తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ జాబు మేళ ఎంతోగానో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం పలు కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. ఈ జాబ్ మేళాలో అన్ని కంపెనీలు కోఆర్డినేట్ చేసిన సుధీర్ 16 కంపెనీలను సమన్వయపరచగా 244 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఏ నాగేంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్స్ కే కాశీశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్, ఉస రవి, అధ్యాపక, అధ్యాప కేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ విద్యానికేతన్‌లో ముందస్తు వేడుకలు

పాఠశాలల్లో.. ముందస్తు దీపావళి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం నాడు ముందస్తు దీపావళి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో ఆ పాఠశాల ప్రిన్సిపల్ కె రంగయ్య, ఏఓ కె రంజిత్‌కుమార్ సారథ్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా దీపావళి పండుగ విశిష్టతను విద్యార్థులకు ప్రిన్సిపల్ రంగయ్య వివరించారు. బాణాసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం నరకాసురుడిని వధించారు. చిన్నారుల వివిధ వేషధారణలు అలరించాయి.

శ్రీసాయి చైతన్య స్కూల్‌లో..

స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని శ్రీసాయి చైతన్య స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆ పాఠశాల సెక్రటరీ అండ్ ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఎం చంద్రశేఖర్ సారథ్యంలో వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

25న మండల సమావేశం

ప్రజాశక్తి-సంతనూతలపాడు: ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు, సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ బి విజయ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ డి సురేష్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అందరూ సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం

పరిశీలకుడుగా ఎంఈవో హాజరు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కాంప్లెక్స్ చైర్మన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి శ్యాంప్రసన్నతాంజలి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమ పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్‌గా పెద్దదోర్నాల మండల విద్యాశాఖ అధికారి బి మస్తాన్‌నాయక్ హాజరయ్యారు. ఈ కాంప్లెక్స్ సమావేశంలో దీర్ఘకాలికంగా పాఠశాలకు హాజరుకాని విద్యార్థులకు పాఠశాలలోకి తీసుకు రావడానికి చేపట్టవలసిన చర్యల గురించి చర్చించారు. ప్రభుత్వ నూతనంగా ఏర్పాటు చేసిన విలువల విద్యా పుస్తకాల్లోని అంశాల గురించి చర్చించారు.

పేరు మార్పు / సవరణ

నేను నక్కల శ్రీనివాసరావు, నివాసం : డోర్ నెం. 1-00, పెద్దపాలెం, గవినివారిపాలెం, ప్రకాశంజిల్లా.

ప్రస్తుతం నా కుమారుడి ఆధార్‌కార్డులో నక్కల మోహన్‌రాజు అని నమోదు కాబడినది. ఇప్పుడు పేరు సవరణ చేయగా **నక్కల మోహన్ రాజేష్ S/o నక్కల శ్రీనివాసరావు (Nakkala Mohan Rajesh, S/o Nakkala Srinivasa Rao)** గా మార్పు చేయుట జరుగుతుంది. కావున నేటి నుండి నా కుమారుడి పేరు నక్కల మోహన్ రాజేష్ గా పిలవబడును. ఆధార్‌లో మార్పు కొరకు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ప్రకాశం జిల్లా ఒంగోలు నగరం కాపురస్థుడు గుంటూరు భాస్కరరావు తండ్రి నాగభూషణం తేదీ 27.09.2025 న నేను బండ్ల మిట్టలో ఉన్న మా ఇంటి వద్ద నుండి కర్నూల్ రోడ్డు లక్కీ షాపింగ్ మాల్ పక్కన ఉన్న నా క్లినిక్‌కు బండిమీద వస్తుండగా నా బండిలో ఒరిజినల్ డాక్యుమెంట్ ఉన్న కవర్ పోయినది. ఒంగోలు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రిజిస్టర్ కాబడినఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 2155/2004 ఒరిజినల్ డాక్యుమెంట్ ను చుట్టుపక్కల వెతికిననూ దొరకలేదు కావున దొరికిన వారు ఈ క్రింది చిరునామా గాని ఫోన్ నెంబర్ గాని తెలియపరచవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు
గుంటూరు భాస్కరరావు
బండ్లమిట్ట ఒంగోలు
సెల్ నెంబర్: 9959694194, 8897513747

ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.560/2020

స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా,
టౌన్ బ్రాంచ్, ఒంగోలు.
REP. BY బ్రాంచ్ మేనేజర్ .....వాది
Vs.
చేబ్రోలు వెంకటేశ్వర్లు. .... ప్రతివాది

To

చేబ్రోలు వెంకటేశ్వర్లు, S/o. కృష్ణ మూర్తి ,
హిందూ, ఉద్యోగం, వయసు 50 సం.,
D.No. 24-160, ఇందిరా నగర్,
నెహ్రూకాన్వెంట్ దగ్గర,అద్దంకి-523201అను వారికి

వాది దావా పరిహారములు రాబట్టుకొను నిమిత్తం మీపై పై నంబరున దావా చేయగా నోటీసు నిమిత్తం తేది:14-11-2025 ఉదయంగం.10:30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొననియెడల మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //

తేది:17.10.2025.
ఒంగోలు ఇట్లు
ముదివర్తి రాఘవరావు,
పెళ్లూరి వసుంధర,
మోటుపల్లి రేణుకాదేవి
అడ్వొకేట్,
సీతారాంపురం, ఒంగోలు.
ఫోన్: 91 9490952792

ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA No : 1245/2023
in
OS No : 725/2021

నాళం నాగమణి వగైరా .... పిటిషనర్లు /వాదులు
వర్సెస్
బొడ్డపాటి వెంకటరావు వగైరా
.... రెస్పాండెంట్స్/ప్రతి వాదులు

To

ప్రతివాదులు /రెస్పాండెంట్లు

1.బొడ్డపాటి వెంకటరావు S/o నారాయణ
R/o హరివిల్లు అపార్ట్ మెంట్స్, రాజీవ్ నగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
2 బొడ్డపాటి భవితవ్ S/o వెంకటరావు
R/o కొత్తపేట, చీరాల,
3. బొడ్డపాటి చరిష్మా D/o వెంకటరావు
R/o కొత్తపేట, చీరాల
4. వల్లెపు వెంకయ్య S/o వెంకటసుబ్బయ్య
R/o డోర్ నెంబర్ 7/233(2) సుజాతనగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
5.పువ్వాడ వెంకటసుబ్బయ్య S/o సంజీవరావు
R/o డోర్ నెంబర్ 5-102 గ్రౌండ్ ఫ్లోర్ 3 క్రాస్ రోడ్డు, వెంకటేశ్వర్ నగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా

పై నెంబరు IA No : 1245/2023 పిటిషన్ లో రెస్పాండెంట్స్/ ప్రతివాదులు అయిన మీకు ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబర్ పిటిషన్ IA No:1245/2023 in OS No 725/2021లో మీహాజరు నిమిత్తం తేది:06-11-2025 నకు వాయిదా కలదు కనుక ఆరోజు ఉదయం గం 10.30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ లాయరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబర్ పిటిషన్ IA No:1245/2023 in OS No: 725/2021లో మీఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేని యెడల పైనెంబర్ పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించెదరు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : 06-11-2025

ఇట్లు
పెండ్యాల శివహరి
అడ్వకేట్, ఒంగోలు

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం: 17/2025

తిరుమలరెడ్డి క్రిష్ణారెడ్డి ..... వాది
వర్సెస్
కందుకూరి పెద్ద కాశయ్య .... ప్రతివాది
టు,
కందుకూరి పెద్ద కాశయ్య, తండ్రి: అడివయ్య
పి.ఎస్.కొత్తపల్లి గ్రామం,
పెద్దారవీడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది ప్లెయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం నీ పైన దాఖలు చేసినందున పై దావాలో నీ ఆక్షేపణలు వినుటకు 27-10-2025వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 27-10-2025
మార్కాపురం **పురాణం సుబ్రహ్మణ్యం,**
వాది తరపు న్యాయవాది,

ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.434/2024

స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా
సంతపేట బ్రాంచ్, ఒంగోలు.
REP. BY బ్రాంచ్ మేనేజర్ .... వాది
Vs.
నూతలపాటి లలిత. .... ప్రతివాది

To

నూతలపాటి లలిత, భర్త : పుష్ప రాజు,
వయస్సు29సం.,వ్యాపారం, డోర్ నెంబర్ :139/B,
గోష్ రోడ్ , రైల్వే రిజర్వేషన్ ఆఫీస్ వెనుక,
ఒంగోలు, ప్రకాశం జిల్లా అను వారికి

వాది దావా పరిహారములు రాబట్టుకొను నిమిత్తం మీపై పై నంబరున దావా చేయగా నోటీసు నిమిత్తం తేది: 23-10-2025 ఉదయం గం. 10:30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయము గా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనని యెడల మీపరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి అనుమతితో //

తేది:17.10.2025.
ఒంగోలు ఇట్లు
ముదివర్తి రాఘవరావు,
పెళ్లూరి వసుంధర,
మోటుపల్లి రేణుకాదేవి
అడ్వొకేట్,
సీతారాంపురం, ఒంగోలు.
ఫోన్: 91 9490952792

ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P. 717/2019
IN
ARC NO. 4/2018

The Citizen Co-Operative Society Ltd.
Hyderabad Rep by its Manager .....DHR
వర్సెస్
Chittithoti Ramanaiah & another . ...JDRs

ఒకటవ JDR తాకట్టు ఉంచిన ఆస్తి పై జారీ కాబడిన అవార్డు ప్రకారం వేలం కావలసిన ఒకటవ JDR తాలూకు ఆస్తి వివరం..

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్-ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ ఒంగోలు-మునిసిపల్ ఏరియా అన్నవరప్పాడు గ్రామం R.S.No. 57/2, D.No. 37-1-413 (53) Doc No : 87/1984 దస్తావేజు దాఖల స్థలం 691.3 చ.గ.లలో నిర్మించిన భవనమునకు హద్దులు:

తూర్పు: Plot No. C/5 of N. నాగేంద్రమ్మ
దక్షిణం : Plot No. B/4 of K. తిరుపాలు రెడ్డి
పడమర : సొసైటీ రోడ్డు
ఉత్తరం : సొసైటీ రోడ్డు
DHR Value: Rs. 1,00,00,000/-
SRO value: Rs 1,52,08,000/-
Ameen Value: Rs.7,00,00,000/-
వేలం వాయిదా 05-11-2025
Further Hearing. 21-11-2025

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు
18-10-2025 ఇట్లు
ముదివర్తి రాఘవరావు
పెళ్ళూరి వసుంధర
న్యాయవాదులు,
సీతారాంపురం,ఒంగోలు ప్రకాశం జిల్లా

చెరువులను తలపిస్తున్న బాలికల హాస్టల్

కొత్తపట్నం బాలికల హాస్టల్‌ను పరిశీలించిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండల కేంద్రంలోని బాలికల సమీకృత సంక్షేమ హాస్టల్‌ను సిపిఎం బృందం పరిశీలించింది. సమస్యల నిలయంగా మారిన కొత్తపట్నం ప్రభుత్వ బాలికల హాస్టల్లోని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కంకణాల రమాదేవి, మండల కార్యదర్శి ఎస్ స్వామి రెడ్డి డిమాండ్ చేశారు. 150 అప్లికేషన్లు రాగా 65 మంది మాత్రమే జాయిన్ అయ్యారనీ, వారిలో కూడా కొందరు మానుకోగా ప్రస్తుతం 51 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీనికి కారణం హాస్టల్లో కనీస వసతులు లేకపోవడమేనని వారు తెలిపారు. ప్రహరీ లేకపోవడంతో వర్షాలకు చుట్టూ నీరు చేరి పాములు, పురుగులు ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాయని తెలిపారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ

పాఠశాలను పరిశీలిస్తున్న కంకణాల రమాదేవి

చీమకుర్తిలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

బాలికల వసతి గృహానికి తక్షణమే కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. భవనం చుట్టూ ఉన్న నీటిని మోటర్స్ ద్వారా బయటికి పంపించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాష్ రూమ్స్ క్లీనింగ్ కూడా సరిగా లేదని, జిల్లా ఉన్నతాధికారులు హాస్టల్లో పరిశీలించి ఉన్న సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం సిపిఎం, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 140 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు సొంత భవనం లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల కోసం కొత్తగా కడుతున్న విద్యాలయం గొర్రెలకు నిలయమైందన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఆశ్రమ పాఠశాలలో 70 శాతం పూర్తి చేశారని, గత 5 సంవత్సరాల కాలంలో నిర్మాణం పూర్తి చేయని కారణంగా ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైందన్నారు. ఆశ్రమ పాఠశాలకు నిధుల కేటాయించి త్వరగా భవనాన్ని పూర్తిచేసి విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీ మస్తాన్, ఎస్ఎఫ్ఐ పాండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి : హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, మెనూ రేట్లు పెంచి నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని సిపిఎం బృందం డిమాండ్ చేసింది. శనివారం సిపిఎం నాయకులు స్థానిక ఎస్సీ, బీసీ, ఎస్టీ గురుకుల హాస్టల్లో పర్యటించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్లో స్లాబ్ లు పెచ్చులూడి రాలి పడుతున్నాయని, రిపేర్లు సగం చేసి మిగతా సగాన్ని వదిలేశారని వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని విద్యార్థులు తెలిపారు. బీసీ కళాశాల విద్యార్థులు హాస్టల్ అద్దె భవనంలో నడుస్తుందని, రూములకు కిటికీలన్ని , తలుపులు ఊడిపోయి దోమలు లోపలికి వస్తున్నాయని, స్విచ్ బోర్డులు ఊడిపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. హాస్టల్ నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన హాస్టల్ చుట్టూ గేదెల నివాసాలు, గేదల వ్యర్థాల దిబ్బలతో దుర్వాసన వస్తుందని, దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉండే వసతి గృహాలలో రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాల ఏర్పాటు చేయాలని, మరమ్మతులు, నూతన భవనాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం బృందంలో పల్లాపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కనిగిరి

ఈనెల 24 నుంచి 26 వరకు కర్ణాటకలోని దావనగిరిలో జరిగే 31వ దక్షిణ భారత ఖోఖో పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ స్త్రీల జట్టుకు కనిగిరికి చెందిన ఏడుగురు విద్యార్థినిలు ఎంపికైనట్లు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష కార్యదర్శి కె.భాస్కరరావు, బి.కాశీ విశ్వనాథ రెడ్డిలు

జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

తెలియజేశారు. ఎంఎస్ఎం కళాశాలకు చెందిన విద్యార్థినిలు యు.నాగమల్లేశ్వరి, ఎం.సఖియా, యు.శశికళ, ఎస్.పావని, ఆర్.యశోద, ఎంఎస్ఆర్ కళాశాలకు చెందిన బి .గుణవతి, పి.అమృత ఎంపికైనట్లు వారు తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి కృష్ణాజిల్లా గన్నవరంలో జరుగుతున్న శిక్షణా శిబిరంలో పాల్గొన్నట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారునులను పిడి బి.కాశీ విశ్వనాథరెడ్డిలను ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరు సుబ్బారావు, ఎంఎస్ఆర్ కళాశాల అడ్వైజర్ పి.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ టి.వెంకట రెడ్డి, రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు టిఎస్ఆర్‌కె ప్రసాద్, ఎం.సీతారామి రెడ్డి, కోశాధికారి కె.హనుమంతరావు అభినందించారు.

జిల్లా బాలికల జట్టు ఎంపిక

వెలిగండ్ల : వెలిగండ్ల ఉన్నత పాఠశాలలో ఖోఖో జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. వచ్చేనెల విజయనగరం జిల్లాలో జరిగే అండర్-19 పోటీల్లో ఈ బాలికల జట్టు పాల్గొంటుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.చింపారెడ్డి, సింగరాయకొండ జూనియర్ కాలేజీ పి.డి కె.శంకర్ తెలిపారు. బాలికల శిక్షణ శిబిరం కనిగిరిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.కె. గౌసియా బేగం, పి.డి బి.కాశీ విశ్వనాథ రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిలు

ఎంపికైన క్రీడాకారులు: టి సుజన, ఏ. పురందేశ్వరి, యు.రేఖ, బి. స్రవంతి, బి.కళ్యాణి, బి.గొనవతి, పి.అమృత, ఎం.నాగేశ్వరి, ఎం.ప్రియాంక, ఎం.యశశ్వరి, మేఘన సాయి, ఎన్‌విఎస్ అశ్రీజ, కె.వైష్ణవి, బి.శృతి, ఎస్.భానుప్రియ

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

విలువలతో కూడిన విద్యనందించాలి

రాష్ట్ర విద్యా శిక్షణా పరిశోధన సంస్థ పరిశీలకులు సంగా మహేంద్ర

ప్రజాశక్తి-కనిగిరి

విలువలతో కూడిన విద్యనందించాలని రాష్ట్ర విద్యా శిక్షణా పరిశోధన సంస్థ పరిశీలకులు సంగా మహేంద్ర అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు చాగంటి కోటీశ్వరరావు ప్రవేశపెట్టిన విలువల సంపుటి పుస్తకాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.విజయలక్ష్మి, రిసోర్సు పర్సన్ వివి రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బస్సులో ప్రయాణిద్దాం.. కాలుష్యాన్ని నివారిద్దాం'

కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ఆర్టీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి-కనిగిరి

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ సేవలను ప్రోత్సహిస్తూ గాలి కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా 'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిద్దాం - గాలి కాలుష్యాన్ని నివారిద్దాం' అనే నినాదంతో డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ఆధ్వర్యంలో శనివారం కనిగిరి డిపోలో క్లీన్ ఎయిర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కనిగిరి డిపో నుంచి పామూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన వ్యక్తిగత వాహనం బదులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగిస్తే గాలి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీ బస్సులు ప్రజల ప్రయాణానికి అత్యంత భద్రతాయుతమైన మరియు పర్యావరణ హితమైన మార్గమన్నారు. మనందరం కలిసి స్వచ్ఛ గాలి కోసం ముందడుగు వేయాలని కమిషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛ గాలి, ఆరోగ్యకర వాతావరణం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఎపిఎస్ఆర్‌టిసి, ప్రజా రవాణా శాఖ లక్ష్యమని తెలిపారు. గ్యారేజ్‌లో మొక్కలు నాటరు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, శానిటరీ సెక్రెటరీలు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ రమేష్ బాబు, డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజి సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ఉప్పుగుండూరులో డీపీవో విచారణ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

విచారణ నిర్వహిస్తున్న డీపీవో

మండలంలో ఉప్పుగుండూరు పంచాయతీ పనితీరు, పారిశుద్ధ్యం, నీటి నిర్వహణపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం డిపిఓ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. పంచాయతీలో ఏ ఒక్కరికార్డు సక్రమంగా లేదని, పారిశుద్ధ్యం సక్రమంగా లేదని నిర్ధారణకు వచ్చారు. పంచాయతీ పార్క్, చెరువులోని నీటిని ఆర్ఓ ప్లాంట్, ఫిల్టర్ బెడ్డులు, కుళాయిల ద్వారా గ్రామానికి సరఫరా చేసే బావులను పరిశీలించారు. పంచాయతీ పాలకవర్గం పనితీరు, సమావేశాల హాజరు తదతర అంశాలపై నివేదిక ఇవ్వాలని ఇఓ శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తేళ్ళ రవికుమార్, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపిటిసి మున్నంగి వెంకట్రావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

మెగా జాబ్ మేళాను వినియోగించుకోండి

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఒంగోలు ఎకె,వికె డిగ్రీ కళాశాలలో ఈనెల 25న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు అర్హత ఉన్న నిరుద్యోగ యువతి యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో జాయల్లూకాస్, ఏస్ స్పోకెన్ ఇంగ్లీష్ అకాడమీ, మాస్టర్ మైండ్స్, హెటిరో ల్యాబ్స్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, భారత్ ఫైనాన్స్ ఇన్‌క్లూజన్, పిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఫ్లిఫ్‌కార్ట్, పేటిఎం, హీరో మోటోకార్ప్, హెచ్‌డిఎఫ్‌సి, లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, కాక్స్‌టాన్ ఫెసిలిటీస్, మ్యాక్సన్ హెల్త్ కేర్ వంటి 23 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న టిడిపి నాయకులు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-కనిగిరి

జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధ్వర్యంలో అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం, కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు సృజితిక, మనోజ్‌లు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 125 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా 94 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరిని ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో ఈనెల 21న అమరావతి గ్రిడ్ నుంచి శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నట్టు క్యాంపు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, మండల పార్టీ అధ్యక్షులు కొండ కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు బాలు ఓబుల్ రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, అచ్చాల రవి, తమ్మినేని సురేంద్ర, షేక్ అహ్మద్, తమ్మినేని వెంకట్ రెడ్డి, కరణం అరుణమ్మ, తమ్మినేని శ్రీనివాసులు, నుదురుపాటి సుబ్బయ్య, పిచ్చాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మురుగుడు సత్యనారాయణ

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

సిఎం చంద్రబాబు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఈపురుపాలెంలో శనివారం జరిగిన చేనేత కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు చంద్రబాబు హామీలు ఇచ్చి దాదాపు 15 నెలలు గడిచినా ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. నేత నేస్తున్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25వేల ఆర్థిక సహాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, ఆప్కో బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. చేనేత కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ కంట్రిబ్యూషన్‌లో ఉన్న రూ.27కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గద్దె హేమ సుందరరావు, వృత్తి సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి పి కొండయ్య, చేనేత నాయకులు ఎర్రం రాధాకృష్ణ, అనాభం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన వెంకట సుబ్బారావు

సుబ్బారావుకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరుకు చెందిన బాచిన వెంకట సుబ్బారావు బిఎస్‌ఎఫ్‌లో ఎస్ఐగా శుక్రవారం ఉద్యోగోన్నతి పొందారు. నార్త్ బెంగాల్లోని సిరిగుడిలో ఆయన ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివిన ఆయన 1988లో బిఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరారు. 2007లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2014లో ఎఎస్ఐగా ఉద్యోగ ఉన్నతి పొందారు. ప్రస్తుతం ఎఎస్ఐ నుండి ఎస్ఐగా పదోన్నతి పొందారు. సిరిగుడిలో అధికారులు ఆయనకు ఎస్ఐ బాధ్యతలు అందజేశారు. 38ఏళ్ల పాటు బిఎస్‌ఎఫ్‌లో సేవలందిస్తూ వచ్చారు. ఎస్ఐగా పదోన్నతి రావడం తనకెంతో ఆనందంగా ఉందని 'ప్రజాశక్తి'తో ఫోనులో తెలిపారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ మించాల సాంబశివరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు శనివారం శంకుస్థాపన చేశారు. శాసన సభ్యులు కొండయ్య ఆదేశాల మేరకు 31వ వార్డు కారంచేడు గేట్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో 15వ ఫైనాన్స్ కింద రూ.35 లక్షలతో నిర్మించనున్న డ్రైన్ పనులకు, 7వ వార్డు శృంగారపేటలో రూ.17 లక్షలతో చేపట్టిన డ్రైన్ పనులకు భూమి పూజ చేశారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ సల్లూరి సత్యనందం, మున్సిపల్ డీఈఈ రఘురాం, ఎఇ రవికుమార్, మంగపతి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రేపల్లె

హాస్టల్ విద్యార్థులకు సురక్షితమైన మంచినీళ్లు అందించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి వై నవీన్ కోరారు. ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ హేమనాగశ్రీ, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో హాస్టల్ విద్యార్థులకు సురక్షితమైన మంచినీరు లేకపోవడంతో అనారోగ్యాల పాలవుతున్న ఘటనలు బయటికి వస్తున్నాయని అన్నారు. హాస్టల్స్‌లో భోజనానికి అవసరమైన మంచినీటిని అందజేయాలని కోరారు. ప్రతి హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ మహిళా కన్వీనర్ హేమనాగశ్రీ

అన్నారు. అత్యధిక మంది విద్యార్థులు చదువుకుంటున్న అంబేద్కర్ గురుకుల పాఠశాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ రిపేర్లు లేకుండా అందుబాటులోకి తీసుకురావాలీని అన్నారు. హాస్టల్లో విద్యార్థులు ఆరోగ్యపరీక్షలు చేయాలని కోరారు. సెలవు రోజుల్లో విద్యా సంస్థలు పెట్టి విద్యార్థులు మానసికంగా వేధిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు. సెలవు దినాల్లో విద్యా సంస్థలు పెడితే ఎస్ఎఫ్ఐగా పోరాటం నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సిహెచ్ మణిలాల్, బి నాగరాజు, జాన్సన్ బాబు, ఆనంద్, కళ్యాణ్, శరత్, పవన్, సంజయ్ కుమార్, గౌతమ్, సుమంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

శనగలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని వివిధ శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న శనగలను రైతు సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య శనివారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం శనగలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవటంతో స్వదేశంతో పాటు మన రాష్ట్రంలో పండించిన శనగ రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. పండించిన పంట అమ్మితే పెట్టుబడి, కౌలుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. దీనికి అదనపు భారంగా మారిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న శనగలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్

వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు

చేశారు. గత ఆరేళ్ల క్రితం కింటా రూ.10వేలు అమ్మిన జెజె సేన గల ధర ప్రస్తుతం క్వింటా 56 ఉండటం శోచనీయమని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు, కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ఇంకొల్లు మండలంలో 7 లక్షల టిక్కీలపైన తెల్ల, ఎర్ర శనగల నిల్వలు పేరుకుపోయి ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్క ఏసీలో 20వేల టిక్కీల నుంచి 30 వేల టిక్కీల వరకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మార్క్ఫెడ్ ద్వారా శనగలు క్వింటా కనీసం రూ.9వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని అన్నారు. తెల్ల శెనగల పడిపోయిందని, తెల్ల, ఎర్ర శనగలు ధరలు ఒకే విధంగా ప్రస్తుతం మార్కెట్లో ఉన్నాయని అన్నారు. ఇంకొల్లు పాత మద్రాసు రోడ్డైన కొనికి, పర్చూరు రోడ్డులోని శీతల గడ్డంగుల్లో శనగల నిల్వల వివరాలు తెలుసుకొని పరిశీలించారు.

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు

చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, వారిలో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక తోడ్పడుతుందని జెవివి ప్రధాన కార్యదర్శి కుంచా వెంకట రామ మోహనరావు, కాటూరు నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు గత 35ఏళ్లుగా నిర్వహిస్తూ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు శనివారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాల్లోని 8, 9, 10 తరగతి తరగతుల విద్యార్థులు 1020 మంది హాజరైనట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రదములుగా నిలిచిన వారిని, ఒక టీంగా ఎంపిక చేసి నవంబర్ 1న నిర్వహించే మండల స్థాయి సైన్స్ సంబరాలకు పాఠశాల తరఫున హాజరవుతారని తెలిపారు. పాఠశాల స్థాయి విజేతలకు అభినందనలు తెలిపారు. గుల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

వేటపాలెం : జెవివి ఆధ్వర్యంలో ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు శనివారం నిర్వహించారు. పాఠశాల స్థాయి పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు 250 మంది చెకుముకి ప్రతిభా పరీక్ష నిర్వహించినట్లు హెచ్ఎం దేవరకొండ సరోజిని తెలిపారు. జెవివి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ఉపాధ్యాయుల సమక్షంలో చెకుముకి ప్రతిభా పరీక్షల ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. జెవివి మండల బాధ్యులు కాల్వ సోమశేఖర్, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేటపాలెంలో పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులు

సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ రోడ్డులోని కాకానిపాలెం, గురకాయపాలెం పాఠశాలల విద్యార్థులు 356మందికి ఉచితంగా సైకిళ్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 10 వేల సైకిళ్లు పంపిణీ చేయాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల్లో నివసించడం వల్ల పిల్లలు చదువు మధ్యలో మానేయకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సైకిళ్లు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామీణ విద్యా పురోభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రతి చిన్నారి విద్యా వకాశం పొందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ కెవి శ్రీనివాసరావు, సింగరకొండ ట్రస్టు బోర్డు చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, పాఠశాల హెచ్ఎంలు, పిఇటిలు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

సూర్యలంకను సినిమా షూటింగ్ స్పాట్ చేయండి

సినీదర్శకుడు దిలీప్ రాజా కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రకృతి సహజ సిద్ధమైన పర్యాటక కేంద్ర మైన సూర్యలంక బీచ్‌ను సినిమా షుటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సినీ దర్శకుడు మా ఎపి వ్యవస్థాపకులు దిలీప్ రాజా కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్ కుమార్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధిలో సూర్యలంక బీచ్ భాగం కాగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నటీ నటులు, సాంకేతిక నిపుణులకు షుటింగ్ సమయంలో వసతి, షుటింగుల కోసం మండువా లోగిలి ఇల్లు, పోలీసు స్టేషన్ వంటి కనీస అవసరాలకు రాయితీతో నిర్మాతలు అద్దే చెల్లిస్తారని అన్నారు. సముద్రం దగ్గర హీరో, హీరోయిన్ల మాంటేజెస్, బోటింగ్, ఛేజింగ్ సన్నివేశాల చిత్రీకరణకు సూర్యలంక బీచ్ అందమైన లోకేషన్ అవుతుందని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నిర్మాత పూసపాటి పవన్ కుమార్, నటుడు మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దిలీప్ రాజా

కంప్యూటర్ బహుకరిస్తున్న బిఒఐ మేనేజర్ వేణుగోపాలరెడ్డి

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కంప్యూటర్‌ను బ్యాంకు మేనేజర్ వేణుగోపాల రెడ్డి పాఠశాల హెచ్ఎం కాటూరు లక్ష్మీనారాయణకు బహుకరించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మురళి పాల్గొన్నారు.

పోలీసు ట్రైనింగ్ కళాశాలను సందర్శించిన ఎస్పి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పోలీసు ట్రైనింగ్ కళాశాలను జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు శనివారం సందర్శించారు. 208 మంది పోలీసు కానిస్టేబుల్ లకు శిక్షణ తరగతులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒంగోలు కొత్త మామడిపాలెంలోని పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌ను (డిటిసి) ఎస్పి సందర్శించారు. ఇతర పోలీసు అధికారులతో కలిసి ట్రైనింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలు, మౌలిక సదుపాయాలు, బ్యారక్‌లు, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. వంట గదిలో అపరిశుభ్రత ఉండటం గుర్తించి వెంటనే మార్పులు చేయాలన్నారు. డైనింగ్ హాల్ లో తలుపులు, పెయింటింగ్ తో బాటు, పైకప్పు నుంచి కారుతున్న వర్షపు నీరును గుర్తించి వెంటనే మర్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్ మరియు ఇతర శిక్షణా కార్యక్రమాలకు ఉపయోగపడే గ్రౌండ్ అభివద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మైదానం చదునుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా, గార్డెన్ సదుపాయాలు మరియు అదనపు మౌలిక వసతుల ఏర్పాటు, శుభ్రతపై నిరంతర దృష్టి అవసరమని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రైనింగ్‌లో నిపుణుల ద్వారా శిక్షణ తరగతులను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రైనింగ్‌లో నేర్చుకున్న విషయాలు వారి సర్వీస్‌లో సుమారు 35-40 సంవత్సరాలపాటు గుర్తించుకొనే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, డీపీఓ ఎఒ రామ్మోహన్ రావు, పోలీస్ క్లీనిక్ డాక్టర్ భానుమతి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, తాలూకా సిఐ విజయకష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు ట్రైనింగ్ కళాశాలలో పరిశీలిస్తున్న ఎస్పి హర్షవర్ధన్ రాజు

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

ఉషా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎందేటి సునీల్ కిషోర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దీపావళి బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉషా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ వై. సునీల్ కిషోర్ తెలిపారు. ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఉషా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో డాక్టర్ సునీల్ కిషోర్ మాట్లాడారు. బాణసంచా కాల్చే సమయంలో చర్మం కాలే ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. కాళ్లు, చేతులు, వీపు ప్రాంతంలోని చర్మం గాయపడే అవకాశం ఉంటుందన్నారు. ఆరు బయట ప్రాంతాలలోనే టపాసులు కాల్చడం మంచిదన్నారు. ఇంటి కారిడార్, ఇంటి పై ప్రాంతాలలో టపాసులు కాల్చవద్దని ఆయన సూచించారు. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించడం మంచిదన్నారు. సిల్క్ దుస్తులు ధరిస్తే ప్రమాదమన్నారు. టపాసులను దూరంగా ఉండి వెలిగించాలన్నారు. టపాసులు వెలిగించేటప్పుడు కళ్ళజోడు పెట్టుకోవడం మంచిదన్నారు. చిన్నపిల్లల్ని ఎత్తుకొని టపాసులు కాల్చరాదన్నారు. టపాసులు కాల్చే వారి పక్కన చిన్నపిల్లలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చర్మం గాయపడితే ప్రథమ చికిత్స

బాణసంచా కాల్చేటప్పుడు పొరపాటున చర్మం కాలితే కంగారు పడకూడదని డాక్టర్ సునీల్ కిషోర్ సూచించారు. చర్మం మంట తగ్గేవరకు చల్లని నీరును గాయం పై ధారగా పోయాలన్నారు. అనంతరం వైద్యుడిని సంప్రదించాలన్నారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే దగ్గరలోని ప్లాస్టిక్ సర్జన్ను సంప్రదించాలన్నారు. ఎక్కువగా పొగ వచ్చే టపాసులు కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. చేతిలో టపాసులు పేలితే . వెంటనే వైద్యుడి సంప్రదించాలన్నారు. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు వల్ల చెవి, కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. తమ హాస్పిటల్‌లో కాలిన గాయాలకు ప్రత్యేక చికిత్స ఉందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9293949335, 986670 0420 లేదా హాస్పిటల్ మేనేజర్ కొండరాజు వెంకట సాయి కష్ణ 6303653004 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



జిఎస్‌టి తగ్గింపుతో డబ్బు ఆదా : దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిఎస్‌టి తగ్గింపుతో డబ్బు ఆదా అవుతుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన శనివారం ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ ఎం.సత్యప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ భవనం నుంచి కాపు కల్యాణమండపం వరకూ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకం లో ఉపయోగించే ప్యానల్, పరికరాలపై జిఎస్‌టి 18 నుంచి 5 శాతం తగ్గించడంతో నిర్మాణ ఖర్చు తగ్గుతుదన్నారు. విద్యుత్ ఆదాతో పాటు నాణ్యమైన విద్యుత్ చౌకగా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఒంగోలు ఎఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ, ఆదిపూడి శంకర్ శాండిల్య, టిడిపి నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు, దాయనేని ధర్మ, మహిళాధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి, ఎపిసిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/ఆపరేషన్ హరిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/ టెక్నికల్ పాపారావు, సీనియర్. అక్కౌంట్స్ ఆఫీసర్ సుబ్బారావు, జిఎస్‌టి అధికారులు, ఉప రవాణా కమిషనర్ అధికారులు, సోలార్ వెండార్స్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ పి.రాజా బాబును యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లోఎమ్మెల్యే కలిసి ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

వీల్ చైర్స్ అందజేస్తున్న దాతలు

జిజిహెచ్‌కు వీల్‌చైర్స్ అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమాజ హితం కోసం పరితపించి దాతృత్వం చూపిన వర్షిత హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సభ్యుల కృషి అభినందనీయమని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మాణిక్యరావు తెలిపారు. వంకాయలపాటి సాంబశివరావు, కవిత దంపతుల కుమార్తె వర్షిత పుట్టినరోజు సందర్భంగా ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు వీల్ చైర్స్, దుప్పట్లు అందజేశారు. వర్షిత మేనత్త, మేనమామ కొమ్మి రమణయ్య, రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.మాణిక్యరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, సిఎస్ ఆర్‌ఎంఒ డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ పుట్టిన రోజులు సందర్భంగా ఆర్భాటాలకు పోకుండా వర్షిత కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలిచారన్నారు. పేలప్రోలు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మంచినేని మాధవి మాట్లాడుతూ వర్షిత కుటుంబ సభ్యులు నిస్సహాయులైన పేదలకు ఆర్థికంగా అండగా నిలిచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఏడేళ్ళ నుంచి పేద వికలాంగ జంటలకు అన్ని తామై వివాహాలు జరిపించి మానవత్వం చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెళ్ళ రాజేశ్వరి. డాక్టర్ ఏడుకొండలు. బి ప్రసాద్. చిక్కాల కిరణ్ కుమార్. భారతి పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పి బి.ఉమామహేశ్వర్ భరోసా కల్పించారు. బాపట్ల జిల్లా జె.పంగులూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పి. వెంకట స్వామి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అందులో భాగంగా ఆయన సతీమణి హేమలతకు రూ. లక్ష రూపాయల అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్‌ను శనివారం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి హేమలతతో మాట్లాడి వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఏదైనా సమస్య వచ్చినా, ఏ సహాయం కావాలన్నా తక్షణం స్పందించి సహాయం అందించడానికి పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పి ఉమామహేశ్వర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్పి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

దీపావళి పండుగ సందర్భంలో నిబంధనలు అతిక్రమించి బాణసంచా విక్రయించినా లేదా నిల్వ ఉంచిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. జిల్లాలో బాణసంచా తయారీ లేదా విక్రయాలు నిర్వహించే వారు లైసెన్సు కలిగి ఉండి, ప్రభుత్వం సూచించిన నియమ, నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. బాణసంచాలు లేదా పేలుడు పదార్థాలను ఇళ్లలో నిల్వ ఉంచరాదన్నారు. శాశ్వత లేదా తాత్కాలిక లైసెన్సు పొందిన దుకాణాల్లో మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత ప్రమాణాల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు నిర్వహించాలన్నారు. షాపుల వద్ద మండే స్వభావం ఉన్న వస్తువులు ఉంచరాదన్నారు. డ్రమ్ములలో నీరు, ఇసుక మరియు ఇతర అగ్నిమాపక సామగ్రి తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలను బాణసంచా దుకాణాల్లో విక్రయాల కోసం ఉంచరాదన్నారు. విద్యుత్ షాట్ సర్క్యూట్ కు తావులేకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టపాసులు విక్రయించే ప్రదేశలలో నిరంతరం డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా బాణాసంచా విక్రయ కేంద్రాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్పి తెలిపారు. కనిగిరిలో ఒకరిపై, మద్దిపాడులో ఒకరు, పామూరులో ఇద్దరు, వెలిగండ్లలో ఒకరు, మార్కాపురం టౌన్‌లో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ.1,38,944 విలువైన బాణాసంచాను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సత్యనారాయణకు నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ సాహితీ రంగాన తన స్థానం సుస్థిరం చేసుకున్నారని సాహితీ భారతీ అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ అన్నారు. విశ్వనాథ 49వ వర్ధంతి సందర్భంగా విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర కవిసామ్రాట్‌గా సత్యనారాయణ ప్రసిద్ధి చెందారని అన్నారు. 1916లో ఆయన సాహిత్య ప్రస్థానం ప్రారంభమైందని అన్నారు. విశ్వేశ్వర శతకం అనే గ్రంథంతో తన రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపా. ప్రసిద్ధ రచనల్లో శ్రీమద్రామా యణ కల్పవృక్షం రచనకు తొలి జ్ఞానపీఠ్ పురస్కారం అందుకున్నారని గుర్తు చేశారు. భారతీయ మధ్యతరగతి సంస్కృతిని ప్రతిబింబించే నవలలు, కిన్నెరసాని పాటలు, వేయిపడగలకు అవార్డులు అందుకున్న విశ్వనాథ 1971లో భారత ప్రభుత్వ జ్ఞానపీఠ అవార్డు, పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ అవార్డు తొలిసారి అందుకున్న ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. రావూరి భరద్వాజ 12వ వర్ధంతి సందర్భంగా భరద్వాజ చిత్రపటానికి పూలమాల వేసిన వాళులు అర్పించారు. కార్యక్రమంలో సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, మర్రి మాల్యాద్రిరావు, కీర్తి వెంకయ్య, ఎం జాకబ్, దగ్గుమల్లి శామ్యూల్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కామరాజు కాళిదాసు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో రద్దీ ప్రదేశంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ జనం ముందు పడిపోతున్నట్లు నటిస్తూ ఆ సమయంలో వారిని కాపాడడానికి వచ్చిన వారి సెల్ ఫోన్లు దొంగిలిస్తున్నారని సిఐ ఆరాధ్యుల సుబ్బరాజు తెలిపారు. వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రజలకు అవగాహన కోసం పోలీసుల ఆధ్వర్యంలో మైకులో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఇళ్ల వద్దకు వచ్చి మోసపూరితమైన మాటలు చెబితే వినకుండా వారిని ఎదురు ప్రశ్నలు వేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బ్యాంకుల వద్ద ప్రజలు రద్దీగా ఉన్న సమయంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండి నగదు భద్రపర్చుకోవాలని అన్నారు. ఈపాటికే పలు బ్యాంకుల వద్ద పోలీసు పహరా నడుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో వృద్ధులు ఇంటి వద్ద ఎక్కువగా ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఎప్పటికప్పుడు ఇంటి వద్ద సమాచారం తెలుసుకోవాలని అన్నారు. ప్రజలు జాగ్రత్తలు వహించి అప్రమత్తంగా ఉంటే దొంగతనాలు అరికట్టబచ్చని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని స్టువర్టుపురం వద్ద బాపట్ల, చీరాల జాతీయ రహదారిలో బైకును లారీ ఢీ కొట్టడంతో బైకుపై ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజు తెలిపారు. బాపట్ల పట్టణం చిల్లర గొల్లపాలెంకు చెందిన బొమ్మనేని శ్రీనివాసరావు (47) చీరాల నుండి బాపట్ల వైపునకు ద్విచక్ర వాహనం (మోటార్ సైకిల్)పై వస్తుండగా ఎదురుగా వస్తున్న డ్రామా కంపెనీ సినీ సెట్టింగ్స్‌కు చెందిన లారీ ఢీ కొనడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. బైకుపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని చెప్పారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వామ్యం కావాలి

ప్రతిజ్ఞ చేస్తున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన రాష్ట్ర నిర్మాణానికి కృషి చేయాలని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. పురపాలక సంఘం, జిఎస్‌డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెత్తా, చెదారం తొలగింపు, ప్లాస్టిక్ పేపర్లు తొలగించడం ద్వారా పరిశుభ్రత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు పని ప్రదేశాలు, మన ఆలోచనలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉంటే పరిశుద్ధమైన ఆలోచనలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురాం, టిపిఓ టి శ్రీనివాసరావు, ఎఈ కిరణ్, మెప్మా సిఎంఎం డొక్క కొండయ్య పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని యనమదలలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించా రు. గ్రామంలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మానవ హారం, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ లబ్ధిదారులను కలిసి ఇనుము, సిమెంట్ గృహ నిర్మాణనికి అవసరమైన వస్తువులపై జిఎస్‌టి తగ్గిందని అవగాహన కల్పించాలని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ బి ప్రకాశరావు మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎండిఒ పిటివి కృష్ణ, కార్యదర్శి ఎ రాణి పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని చెరుకూరు పిహెచ్‌సిలో స్వచ్ఛ్ ఆంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా ఉప్పుటూరు హెూమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ వాయు కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని అవగాహన కల్పించారు. పెరిగిన మోటారు వాహనాల వినియోగ కారణంగా వాయు కాలుష్యం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ రవాణా మార్గాలు వినియోగించుకోవడం ద్వారా వాయు కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు.

కారంచేడు : ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపిడిఒ కె నేతాజీ, డిప్యూటీ ఎంపిడిఒ రామ్మోహనరావు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

నిజాంపట్నం : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు, సర్పంచ్ కట్టా పోలేరమ్మ పాల్గొన్నారు.

బాపట్ల : పరిసరాల పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ నినాదం ఒకసామాజిక ఉద్యమంగా స్వచ్ఛ ఆంధ్ర సాధనకు కృషి చేయాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, సూపర్ జీఎస్టీలో భాగంగా పట్టణంలో డ్రైవర్స్ కాలనీ విద్యుత్తు ఎస్ఈ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన సోలార్ పలకలు పరిశీలించారు. జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ, టిడిపి ఇపట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సోలార్ పలకలు పరిశీలిస్తున్న బాపట్ల ఎంఎల్ఎ నరేంద్రవర్మ

సముద్ర తీరంలో పర్యాటకుల భద్రతకు చర్యలు

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో ఐదు గురు విద్యార్థులు ఒకేసారి అలల తాగడానికి గురై మృతి చెందిన ఘటన ఎంతో దిగ్భ్రాంతికి గురి చేసిందని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. కార్తీకమాసం సముద్ర స్నానాల సందర్భంగా వేటపా లెం మండలం రామాపురం రిసార్ట్‌లో ఆర్డీఒ చంద్రశేఖ ర్ నాయుడు, డిఎస్పి మొయిన్, రిసార్ట్ నిర్వా హకుల సమక్షంలో సమావేశం శనివారం నిర్వహించారు. భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సముద్ర తీరంలో మెరైన్ పోలీసుల పెట్రోలింగ్ బలో పేతం చేయాలని అన్నారు. లోతైన ప్రాం తాలకు వెళ్లి ప్రమాదాలకు గురైన ఘటనలు గుర్తు చేశారు. చైర్మన్ మించాల సాంబశివరావు, రిసార్ట్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

నిజాంపట్నం : హార్బర్ సముద్ర బీచ్‌లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ కందుల తిరుపతిరావు తెలిపారు. హార్బర్ సముద్ర బీచ్‌లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. యాత్రికుల రక్షణార్థం బీచ్‌లో బందోబస్తు ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాల నిఘాతో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సందర్శకులు ఎవరు జట్టి మీద ఎక్కడం, నడవడం చేయడం నిషేధమన్నారు. బీచ్‌లో అసాంఘిక కార్యకలాపాలైన మద్యం సేవించి బీచ్‌కి రావడం నిషేధమన్నారు.

పిపిపికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలు పక్కనబెట్టి విద్యా రంగాన్ని వ్యాపారంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, అందులో భాగమే ప్రభుత్వ వైద్య కాలేజీలు ప్రైవేటీకరణ చేయాలన్న కూటమి ప్రభుత్వం యత్నాలు చేస్తుందని వైసిపి ఇంచార్జి కరణం వెంకటేష్ అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ మండలంలోని ఈపురుపాలెం పంచాయతీ నేతాజీ యూనియన్ వద్ద రచ్చబండలో సేకరించారు. నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డి పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని గాద మధుసూదనరెడ్డి స్వగ్రామమైన పావులూరులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు చిన్ని పూర్ణచంద్రరావు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, కన్వీనర్ మల్కా సుబ్బారెడ్డి, తాటిపర్తి చంద్రశేఖరరెడ్డి, పూలకొండ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న కరణం వెంకటేష్

ఈ పంట నమోదైతేనే యూరియా

ప్రజాశక్తి - అద్దంకి

ప్రభుత్వం యూరియా కొరత, దుర్వినియోగం అరికట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుందని ఎఒ వెంకట కృష్ణ తెలిపారు. ఇకపై ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా అందుబాటులో ఉంటుందని, రాబోయే రబీ సీజన్ నుండి పంపిణీలో ఆధార్ ఓటీపీ వెరిఫికేషన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు ఆధార్‌కి లింకైన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని అన్నారు. యూరియా మూడు విడతల్లో అందించనున్నట్లు తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించే రైతులకు ప్రభుత్వం అదనంగా ప్రోత్సాహకం ఇస్తోందని తెలిపారు. తగ్గించిన ప్రతి బస్తాకు రూ.800 ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. ఈ పంట నమోదుకు అక్టోబర్ 25 వరకు గడువు ఉందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో యూరియాతో పాటు ప్రభుత్వ పథకాలు, బీమా ప్రయోజనాలు కోల్పోతారని తెలిపారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి - చీరాల

నేటి సమాజంలో జరుగుతున్న అరాచకాల పట్ల విద్యార్థినిలు అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో సమాజంలో రాణించాలని అంగనవాడి సూపర్వైజర్ గ్లోరీ అన్నారు. అక్టోబర్ 11 నుండి 18 వరకు జరుగుతున్న బాలికల దినోత్సవం సందర్భంగా పేరాల ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పడావో, ఆడపిల్లను కాపాడుకుందాం, ఆడపిల్లను రక్షించుకుందాం అనే ప్రధాని పథకాల ప్రాధాన్యత వివరించారు. ఆడపిల్లల విద్య, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన రాణి, సంధ్యారాణి, అరుణ, లత, మాధవి, ప్రసుమాంబ, కళ్యాణి, రత్నకుమారి, హెచ్‌ఎం కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ గోపి

యద్దనపూడి : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. సమావేశం ఎంఇఒ గోపి అధ్యక్షతన నిర్వహించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. పర్చూరు ప్రాజెక్టు సిడిపిఒ సుభద్ర మాట్లాడుతూ ఆడపిల్లలు పెళ్లి వయసు రాకుండా బాల్య వివాహం చేసుకో కూడదని అన్నారు. ఎంపిడిఒ పిటివి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థునులు చదువు తోపాటు ఆటలు, అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుజాత, ఎంఎస్‌కె బి జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
ఆదివారం 19 అక్టోబర్ 2025

'ప్రభుత్వ సేవల్లో' జిల్లాకు ప్రథమ స్థానం

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు పొందడంలో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రజలు సచివాలయాల ద్వారా అత్యధికంగా ప్రభుత్వ సేవలు పొందడం సంతోషదాయకమని అన్నారు. పాన్ కార్డు నవీకరణ పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అన్నారు. అపార్ ఐడిలను గడువులోగా నమోదు చేయాలని అన్నారు. పాఠశాలల హెచ్ఎంలు విచారణ చేపట్టాలని అన్నారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారులందరికీ ఆధార్, బయోమెట్రిక్ నవీకరణ వేగంగా చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతిగహాల్లో తాగునీరు కాలుష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలనని అన్నారు. స్మార్ట్ రైస్ కార్డుల

వీక్షణ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

పంపిణీ 92 శాతం ఉండడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఇ-పంట నమాదు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ రాయితీ పొందడానికి ఆక్వా రైతుల పేర్లను సచివాలయాల్లో నమోదు చేయించాలని తెలిపారు. ఆక్వా చెరువులకు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ రాయితీ మరింత విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఒక యూనిట్ విద్యుత్తుకు రూ.1.50 రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఆక్వా రైతులందరికీ రాయితీ వర్తింప చేస్తున్న నేపథ్యంలో నెల రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అసైన్డ్ భూముల నిర్ధరణ చేయించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థంగా నడపాలని చెప్పారు. జిల్లాలో 118 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా, ప్రతి కేంద్రంలో గోనె సంచులు, తేమ శాతం పరిశీలించే యంత్రాలు ఉండాలని అన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్, రైతుల కొరకు కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. టార్పాలిన్ బట్టలు సిద్ధం చేసుకోవాలన్నారు. గోదాములు, నిల్వ సామర్థ్యం, హమాలీల వివరాలపై అధికారులు పరిశీలించాలని అన్నారు. బ్యానర్లు, కరపత్రాలతో విస్తృతమైన ప్రచారం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో మత్స్య శాఖ అధికారి శ్రీనివాస్ నాయక్, గాలి దేముడు, వ్యవసాయ శాఖ డీడీ అన్నపూర్ణ, డీఈఒ పురుషోత్తం, కలెక్టరేట్ ఎఒ మల్లికార్జునరావు, సచివాలయాల కోఆర్డినేటర్ పి యశ్వంత్ పాల్గొన్నారు.

దగ్ధమవుతున్న కంటైనర్ లారీ

టైరు పేలి డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

చెన్నై నుంచి మంగళగిరి వెళుతున్న కంటైనర్ లారీ తాతపూడి, రాజుపాలెం మధ్య జాతీయ రహదారిపై టైరు ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. దీంతో డీజిల్ ట్యాంకు పేలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలు కంటైనర్ లారిలో తరలిస్తున్న న్యూస్ ప్రింట్‌కు వినియోగించే మెటీరియల్ అగ్నికి ఆహుతైంది. అప్రమత్తమైన కంటైనర్ డ్రైవర్, క్లీనర్ లారీ నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. జాతీయ రహదారిపై ఒక్కసారిగా కంటైనర్ లారీ నుండి మంటలు వ్యాపించడంతో రోడ్డుకి ఇరువైపులా వెళ్లే వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. సిఐ మాదినేని శేషగిరిరావు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

దీపావళి దుకాణాలకు అనుమతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

కోరిసిపాడు మండలంలో దీపావళికి సంబంధించిన మందులు అమ్మే అమ్మకం దారులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ మహమ్మద్ రఫీ శనివారం తెలిపారు. అనుమతి లేకుండా మందులు అమ్మితే చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని సూచించారు.

నిందితులకు అపరాధ రుసుం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను, వెంపరాలలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులని సిఐ ఆరాధ్యుల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎజెఎఫ్‌సిఎం కోర్టు నందు హాజరు పర్చగా న్యాయమూర్తి బి అఖిల మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఒక వ్యక్తికి రూ.4వేలు, మిగిలినవారికి ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున, పేకాట ఆడిన వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున అపరాధ రుసుం శనివారం విధించారు.

నేర నియంత్రణకు డ్రోన్‌తో పహారా

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలో ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా డ్రోన్ సహాయంతో నిఘా వ్యవస్థ పటిష్టం చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో పరిశీలించారు. బహిరంగ మద్యపానం సేవించడం, జూదం, సంఘ విద్రోహ కార్యకలాపాల పట్ల నిరంతరం నిఘా ఏర్పాటు చేసేందుకు డ్రోన్ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సూచించారు. షాపింగ్ సందడి కార్యక్రమాల నిర్వహణపై వాణిజ్య పన్నుల అధికారులతో స్థానిక కలెక్టరేట్లో ఆయన సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో ఉత్పత్తులు, వస్తువుల ధరల పట్టికను ప్రతి దుకాణంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. గోడ పత్రికలు, కరపత్రాలు దుకాణాల్లో కనిపించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మందులు దుకాణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణాల్లో బోర్డులు ఉండాలని అన్నారు. వస్తువుల ఉత్పత్తి ప్రాంతాలు, హెూల్ సేల్ కేంద్రాలు, రిటైల్ దుకాణాల వద్ద బోర్డులు ఉండాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా షాపింగ్ సందడి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పట్టణంలోనూ షాపింగ్ సందడి భారీగా చేపట్టాలన్నారు. సమావేశంలో వాణిజ్య పన్నుల అధికారులు గ్లోరియా కుమారి పాల్గొన్నారు.

పర్చూరు : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రమైన పర్చూరు, ఇంకొల్లు రోడ్డులోని హెూండా షోరూం నుండి బొమ్మల సెంటర్ వరకు చీరాల ఎంవిఐ రవి నాయక్ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు 28 శాతం నుండి 18 శాతానికి జిఎస్‌టి తగ్గించిందని వెల్లడించారు. వాహనాల విడిభాగాలపై 12 నుండి ఐదు శాతానికి తగ్గిందని తెలిపారు. వాహన దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షోరూంల ప్రతినిధులు తగ్గించిన జిఎస్టి ప్రకారం అమ్మకాలు సాగించాలని చెప్పారు. కార్యక్రమంలో హెూండా షోరూం సిబ్బంది కోట నాగభూషణం పాల్గొన్నారు.

జీఎస్టీపై బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బ్యాంకు వద్ద పొదుపు మహిళల ధర్నా

ప్రజాశక్తి - ముండ్లమూరు

బ్యాంకులో ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

డ్వాక్రా మహిళలు తమ నగదుకు సంబంధించి స్టేట్మెంట్ ప్రింట్ ఇవ్వాలని ఎపిజిబి వద్ద మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన 150 మంది మహిళలు శనివారం ధర్నా చేశారు. శంకరాపురంలో 67 డ్వాక్రా మహిళా గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపులకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు ముండ్లమూరు ఎపిజిబి బ్యాంకులో జరుగుతున్నాయి. ఈ 67 గ్రూపుల మహిళలు వెలుగు కార్యాలయం ద్వారా బ్యాంకు రుణాలు పొందారు. రుణాలు తిరిగి చెల్లిస్తూ, పొదుపు నగదు తమ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ నగదు జమ చేసే సమయానికి బ్యాంకు దగ్గరకు వస్తే బ్యాంకు అధికారులు బయట ఉన్న బ్యాంకు మిత్ర (బ్యాంకు కరస్పాండెంట్) ల దగ్గరకు వెళ్లి శ్రీరామ్ సునీతకు ఇవ్వాలని తెలిపారు. ప్రతి నెల నగదు ఆమెకు ఇస్తున్నారు. ఈ క్రమంలో నగదును వారి ఖాతాలకు జమ చేయకుండా అవినీతికి పాల్పడుతుందని అనుమానం వచ్చిన శంకరాపురం మహిళలు 150 మంది బ్యాంకుకు వచ్చి బ్యాంకు మేనేజర్ సర్వేర్ మోహన్ త్రివేదిని తమ ఖాతాలకు సంబంధించిన నగదు చెల్లింపుల స్టేట్మెంటు ఇవ్వాలని వాగ్వి వాదానికి దిగడంతో కొన్ని గ్రూపులకు సంబంధించిన ఖాతాలు పరిశీలించారు. సింగరకొండ గ్రూపు రూ.1.02లక్షలు, కీర్తన గ్రూపు రూ.70వేలు, దుర్గా గ్రూపు రూ.1.20లక్షలు, ఐజక్ గ్రూపు రూ.20వేల నగదు జమ కాలేదని మేనేజర్ తెలిపారు. ప్రతినెలా తాము చెల్లిస్తున్నప్పటికీ నగదు జమకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పూర్తి వివరాలతో మంగళవారం అన్ని గ్రూపులకు సంబంధించిన నగదు లావాదేవీల స్టేట్మెంటు ఇస్తామని తెలిపారు. అయితే బ్యాంకు అధికారులు నగదు జమ, నగదు తిరిగి తీసుకోవడంలో ఇవ్వాల్సి ఉండగా బ్యాంకు పక్కన ఉన్న రేకుల షెడ్డులో ఐదుగురు బ్యాంకు మిత్రుల ద్వారా ఆధార్ కార్డు ద్వారా నగదు చెల్లింపులు జరుపుతున్నారు. తమ బ్యాంకు కాతాల లావాదేవీలు చెప్పాలని కోరుతున్నప్పటికీ పాస్‌బుక్కుపై ప్రింటు ఇవ్వడం లేదని అన్నారు.

సహాయ నిధి చెక్క అందజేస్తున్న ఆనందబాబు

సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని మోపర్రు గ్రామానికి చెందిన కొడాలి షణ్ముగనాథ్, చుండూరు మండలం వలివేరుకు చెందిన తుర్ల షడ్రక్, కిరణ్ కుమార్, వేమూరు మండలం చావలికి చెందిన వెలివల ఉపేంద్ర అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుండి రూ.6.20 లక్షల నిధులు మంజూరు చేసింది. వీటిని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా శనివారం అందజేశారు.

హత్య కేసులో బెయిల్ మంజూరు

ప్రజాశక్తి - సంతమాగులూరు

నరసరావుపేట జంట హత్యల కేసులో బాదం మాధవిరెడ్డితో సహా 11మందికి శనివారం నరసరావుపేట కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2025 జులై 23న నరసరావుపేట కోర్టు సెంటర్‌లో కిడ్నాప్ చేసి సంతమాగులూరు మండలం పాత మాగులూరు శివారులోని వెంచర్ వద్ద బెంగళూరుకు చెందిన తండ్రి, కొడుకు వీరస్వామిరెడ్డి, ప్రశాంతిరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఆ కేసులో సంతమాగులూరుకు చెందిన బాదం మాధవరెడ్డితో సహా 12మందికి ప్రమేయం ఉన్నట్లు పోలీసుల అభియోగంతో అదే నెల 27న అరెస్టు చేసి రిమాండుకు పంపారు.



దిగుడు బావిలో ఉన్న గుర్తుతెలియని మృతదేహం

బావిలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పంట చేలోని వ్యవసాయ దిగుడు బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. మార్టూరు సమీపంలోని ఇసుక దర్శి, వలపర్ల వెళ్లే దారిలోని వ్యవసాయ దిగుడు బావిలో రాయి కట్టి ఉన్న మృతదేహం బావిపైన నీటిలో తేలియాడుతూ ఉండటాన్ని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న మార్టూరు సిఐ మాదినేని శేషగిరిరావు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహానికి రాయి కట్టి ఉండటంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పడవేశారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నగదు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్

హోంగార్డు కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి - బాపట్ల

చీరాల పోలీసు సబ్ డివిజన్‌లోని ఇంకొల్లు పోలీసు స్టేషన్లో హెూంగార్డు శ్రీనివాసరావు భార్య క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో రిజర్వ్ ఎస్ఐ శ్రీకాంత్ తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. ఆయన స్ఫూర్తితో ఎఆర్ ఎస్ఐ సుధాకర్ తమ వంతుగా రూ.10వేల నగదు అందజేశారు. హెూంగార్డు ఎన్‌సిఓ బేగ్ ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు శ్రీకాంత్ తెలిపారు.

మంత్రి స్వామిని కలిసిన ఎంఎస్‌పిఎస్ నాయకులు

మంత్రి స్వామికి వినతి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఎస్‌సి నిరుద్యోగ యువత ఆశగా ఎదురుచూస్తున్న ఎస్‌సి యాక్షన్ ప్లాన్ రుణాలను సత్వరం విడుదల చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి నాయకులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి విజ్ఞప్తి చేశారు.క్యాంప్ కార్యాలయంలో శనివారం మంత్రి కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ పథకం ద్వారా యువత దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. రుణాల మంజూరులో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. దీంతో స్పందించినర మంత్రి మాట్లాడుతూ డిసెంబర్ చివరి నాటికి ఎస్‌సి యాక్షన్ ప్లాన్ రుణాల పంపిణీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాలతో చర్చించి నిరుద్యోగులకు ఉపయోగపడే యూనిట్లను సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎంఎస్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడ కొమ్ము సుజన్ మాదిగ, గద్దె త్యాగరాజు, కొలకలూరి విజయ్ కుమార్, కత్తి రాజేష్, శ్రీవిద్య ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ కవిల యలమంద ఉన్నారు.

వాయు కాలుష్య నివారణ అందరి బాధ్యత

ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రాజాబాబు

వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాలలో ఈ దిశగా దష్టి సారించాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడవ శనివారం ప్రత్యేక ఇతివత్తంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈనెల ' క్లీన్ ఎయిర్ ' ఇతివత్తంతో కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. అందులో భాగంగా ప్రకాశం భవనంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ పి.రాజాబాబు క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం భవనం వరకూ నడిచి రావటం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని నివారించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరించాలని సూచించారు. కార్యాలయాలకు, ఇతర అవసరాల కోసం బయటకు వెళ్లేవారు దగ్గరలో అయితే నడుచుకుంటూ లేదా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాలని పిలుపునిచ్చారు. దూరమైతే వ్యక్తిగత వాహనాలు కాకుండా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా పర్యావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలలో భాగస్వాములు కావాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. వాహనాల ద్వారా వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మరోవైపు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చుని తెలిపారు. అనంతరం కలెక్టర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు కలెక్టరేట్‌లో మొక్కలు నాటారు. వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.చిన ఓబులేసు, డిఈఒ ఏ.కిరణ్ కుమార్, సిపిఒ సుధాకర్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్. ఆయేషా బేగం, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోలేని దివాళాకోరు ప్రభుత్వం ఇది : వైసిపి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఈ ఏడాది మాగాణి, శనగ, మిర్చి, పొగాకు పంటలు సాగుచేసిన రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారని, కూటమి ప్రభుత్వం 18 నెలలుగా ఒక్క రైతును ఆదుకోలేదని, ఇది దివాళా కోరు ప్రభుత్వమని వైసిపి నేతలు ఆరోపించారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు ఆ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. గత రెండు సీజన్లకు శనగ పంటకు గిట్టుబాటు ధర లభించక కోల్డ్ స్టోరేజిల్లో మగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇదే పరిస్థితి ఎదురైతే అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్వింటాకు రూ. 1500 వంతున బోనస్ ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కో రైతు వద్ద నుంచి గరిష్టంగా 30 క్వింటాళ్ల తెల్ల శనగలు క్వింటా రూ 12,వేలు, ఎర్ర శనగలు రూ. క్వింటా రూ. 10 వేలు చొప్పున కొనుగోలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ నమోదు, పంటల బీమా అమలు చేసినట్లు తెలిపారు. తద్వారా ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులు, గిట్టుబాటు ధరల పట్ల చులకనగా చూస్తుందని ఆరోపించారు. ఈ ఏడాది పొగాకు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. ఒక్కొక్క బ్యారెన్‌కు రూ 5.లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల బ్యారెన్ల రూ.2200 కోట్లు విదేశీ మారకద్రవ్యం సమకురుస్తున్న పొగాకు రైతులను కూటమి చులకనగా చూస్తుందని దుయ్యబట్టారు. బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియలో కూటమి అనుయాయులకు చెందిన పొగాకును మాత్రమే కొనుగోలు చేయడం వివిక్షత పూరిత చర్యగా ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శనగలకు క్వింటాకు రూ. 3వేలు బోనస్ ప్రకటించాలన్నారు. తెల్ల శనగలు క్వింటా రూ.10వేలు, ఎర్రశనగలు క్వింటా రూ.8 వేలు చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.వైసిపి జోనల్ రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి, కొత్తపట్నం ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉప్పు రైతు, ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అమలు కావడం లేదన్నారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, నగర కార్యదర్శి కఠారి శంకర్, వైసిపి ఒంగోలు మండల కార్యదర్శి మన్నె శ్రీనివాసరావు, నాసర్ రెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, డి.కోటేశ్వరరావు, వెంకటేశ్వర రావు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఆక్వా రంగ అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మత్స్య శాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లోని మినీ వీక్షణ సమావేశం మందిరంలో మత్స్య శాఖ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వాకల్చర్‌ను అభివద్ధి చేసేందుకు, అందులోని సమస్యలను అధిగమించి ఆక్వా రంగాన్ని వ్యవస్థీకత పరిశ్రమగా మార్చడం ద్వారా ఆక్వా కల్చర్ కార్యకలాపాలు, ఉత్పత్తులు, సేవలను ఓ గొడుగు కిందికి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం జలచరాభివృద్ధి సంస్థ, చట్టం 2020ను రూపొందిం చినట్లు తెలిపారు.ఈసందర్భంగా రాష్ట్ర జలచరాభివద్ధి సంస్థ చట్టం విధివిధానాలను, లక్ష్యాలపై మత్స్యశాఖ అధికారులతోకలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఆక్వాకల్చర్ సాగు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సులు పొంది ఉండాలన్నారు. లైసెన్సులు కావాల్సిన వారు సేవా అభ్యర్థన దరఖాస్తులు గ్రామ సచివాలయంలో స్వయంగా లేదా డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఇ- మత్స్య కార్ వెబ్ పోర్టల్ లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆక్వాకల్చర్ అభివృద్ధికి జిల్లాస్థాయిలో, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసైన్డ్ భూములలో ఆక్వాకల్చర్ సాగు చేసే వారి వివరాలపై జిల్లా కలెక్టర్ మత్స్యశాఖ అధికారులను ఆరా తీశారు. అసైన్డ్ భూములు ఇచ్చిన వారి కుటుంబ సభ్యులు మాత్రమే ఆ భూమిలో ఆక్వా సాగుకు అనుమతులు ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో 9,579.44 హెక్టార్ల విస్తీర్ణములో ఆక్వాకల్చర్ సాగు జరుగుతుందన్నారు. అందులో 6257.59 హెక్టార్ల మాత్రమే రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిపారు. 3321.85 హెక్టార్ల భూమికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. ఆక్వా కల్చర్ సాగు భూమి రిజిస్ట్రేషన్‌కు మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్ నాయక్, డీడీ గాలి దేవుడు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో నిస్తేజం

రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచింది. గత ప్రభుత్వ హయాంలో వెనుకబాటుకు గురైన ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని, జిల్లాల సమగ్రాభివృద్ధికి నిధుల కేటాయిస్తారని, రహదార్లు బాగుపడుతాయని,మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని, ఉపాధి అవకాశాల పెంపుదలలో భాగంగా కొత్త పరిశ్రమలు వస్తాయన్న ఆశలో ప్రజలు ఉన్నారు. రెండు జిల్లాల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు, సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పారు. పరిష్కారానికి హామీలు లభించాయే తప్ప నిధుల విడుదలకు ఊసే లేదు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అవకాశం వచ్చినప్పుడల్లా ముఖ్య మంత్రిని కలిసి నియోజకవర్గంలో సమస్యల పరిష్కా రం, అభివద్ధి పనులపై చర్చించారు. నిధులు కోరారు. చెప్పుకోదగ్గ రీతిలో నిధులు వచ్చిన పరిస్థితి లేదు. అధికారులు కూడా సమీక్షలతో కాలం గడుపుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసి గొప్పగా చెప్పుకోవడం తప్ప జిల్లాల సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు లేవు. దీంతో పాలన నిస్తేజంగా సాగుతోంది.

బాపట్ల జిల్లా లోని పర్చూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగిస్తే అనేక గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇది దశాబ్దాల కాలంగా సమస్యగా ఉంది. పంట కాలువలను బాగు చేయలేదు. యేటా పంట పొలాలను ముంచుతున్న డ్రైనేజి వ్యవస్థను అస్తవ్యస్తంగానే ఉంది.గతేడాది అక్టోబర్ 14వ నుంచి 20 వరకూ పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు వారం వారం బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, ఉద్యాన పంటల సాగు, నీటి కుంటలు, గోకులాలు నిర్మించాలని, నీటి నిల్వకు ఉపయోగపడే ట్రెంచులను తవ్వాలని నిర్ణయించారు. నిధుల మంజూరు సక్రమంగా జరగలేదు. ఆర్ అండ్ బి రోడ్ల పరిస్థితి ఇలానే ఉంది. బిల్లులు రావడం లేదు.ప్రకాశం జిల్లాలో దొనకొండ, కనిగిరి ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి.

ప్రతి ఏటా కౌలు రైతుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడమే తప్ప వారికి ఎలాంటి మేలు జరగలేదు. కౌలు రైతు కార్డులు ఇచ్చే పరిస్థితి లేదు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. బాపట్ల జిల్లాలో 8 వేల మంది కౌలు రైతులకు రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం. అయితే బ్యాంకర్లు కేవలం 2,326 మందికి రూ.8.80 కోట్లు రుణం ఇచ్చారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ళు ముగిశాయి.రాష్టప్రభుత్వం చివరి ఆకు వరకూ కొంటామని హామీ ఇచ్చింది. చివరకూ కేవల 13,600 టన్నుల పొగాకును కొనుగోలు సిద్ధపడింది. రైతులకు నగదు చెల్లింపులు పూర్తిగా జరగలేదు. ఇప్పటికీ రైతుల వద్ద సుమావరు 30 వేల టన్నుల పొగాకు నిల్వ ఉంది. దీని కొనుగోలు సంగతి ఏమిటనేది తెలియడం లేదు. రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ వ్యవసాయ సీజన్‌లో నల్ల బర్లీ పొగాకు సాగు చేయొద్దని చెప్పారు. అందుకు ప్రత్యామ్మాయంగా ఏమి పంటలు సాగు చేయాలి, ప్రభుత్వం ఏమైనా రైతులకు చేయూత నిస్తుందా అన్న విషయంపై స్పష్టత లేదు.

జిల్లాల్లో అభివృద్ధి పనుల అమలు సంగతి ఎలా ఉన్నా కూటమి ప్రభుత్వ హాయాంలో అవినీతి, అక్రమాలు యథేశ్చగా కొనసాగుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబు తమ పార్టీకి నేతలకు అక్రమ ఇసుక అమ్మకాలు, రేషన్ బియ్యం అమ్మకాలు, మద్యం సిండికేట్ వ్యవహారాల జోలికి వెళ్ళవద్దని పదే పదే చెబుతున్నారు. ఆచరణలో ఇవేవి నేతల చెవికెక్కడం లేదు. అధికారం లోకి వచ్చిన మూడో నెల నుంచే తమ నియోజకవర్గాల్లోని ఆదాయ వనరులపై దృష్టి సారించిన ప్రజాప్రతినిధులు నేరుగా కొందరు, తమ అనుచరుల ద్వారా కొందరు అక్రమ వ్యవహారాలు నడుపుతున్నారని వెల్లడవుతుంది. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా పనులు అధికారం అండగా సాగుతున్నాయి. సముద్రతీరంతో పాటు, కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో యథేశ్చగా ఇసుక అక్రమ తరలింపులు చేపట్టారు. జెసిబిలు, టిప్పర్లతో ఇసుక తరలిపోతున్నా అధికారులు చర్యలు తీసుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. మద్యం దుకాణాలు అధికారం అండగా సిండికేట్‌గా ఏర్పడ్డాయి. బెల్ట్ షాపులు వచ్చాయి. వీటిని అధికార పార్టీ నేతల అండదండలతోనే నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కొన్ని చోట్ల నేరుగా భాగస్వాములయ్యారు. పర్సంటేజ్‌ల పద్ధతిలో కొన్ని చోట్ల వాటాలు తీసుకున్నారు. ప్రతినెలా ఆదాయం సమకూరే రేషన్ బియ్యం దందాను కూడా అధికారపార్టీ నేతలు కొనసాగిస్తున్నారు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా